క్లుప్తంగా

39 మంది సీఆర్‌టీలకు రెన్యువల్

సీతంపేట: స్థానిక ఐటీడీఏ పరిధిలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 39మంది సీఆర్‌టీలను రెన్యువల్ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. ఈ విద్యా సంవత్సరం ఆరంభంలో కొంతమంది సీఆర్‌టీలను వివిధ కారణాలతో నిలుపుదల చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ ఉన్నతాధికారులకు ఈ విషయంపై నివేదిక పంపించారు. దీనిపై స్పందించిన గిరిజన సంక్షేమశాఖ అధికారులు తక్షణ భర్తీకి ఆదేశాలు జారీచేశారు. ఆయా పాఠశాలల్లో ఉన్న ఖాళీలకు అనుగుణంగా వారికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

తెలుగు పండిట్‌లకు సత్కారం



మాట్లాడుతున్న వక్తలు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగు భాషోపాధ్యాయుల సన్మాన కార్యక్రమం మంగళవారం జరిగింది. సేవాకిరణ్ సంస్థ అధ్యక్షుడు చింతా భాస్కర నాయుడు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు భాష పరిరక్షణకు కృషిచేస్తున్న ఉపాధ్యాయులు కె.జనార్దనరావు, టి.సూర్యనారాయణ, తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో సేవాకిరణ్ సంస్థ సభ్యులు గోవిందరావు, అనంతాచారి, గ్రంథాలయ అధికారి బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఊరటనిచ్చిన వర్షం



పాలకొండ-వీరఘట్టం రహదారిలో శివారున ఉన్న వరి పొలాల్లో చేరిన నీరు

పాలకొండ రూరల్: గత కొద్ది రోజులుగా వరుణుడి కరుణకు అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో బంగాళాఖాతంతో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి ప్రభవంతో సోమవారం రాత్రి, మంగళవారం కురిసిన వర్షాలు ఊరటనిచ్చాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపుగా 50 రోజులు పైబడిటంతో వరిపంట కీలకదశలో ఉంది. ఈ సమయంలో సాగునీటి సమస్యలను తలచుకుని ఆందోళన చెందుతున్న రైతులకు వాతావరణ శాఖ సూచనలతో మండల రైతులు కొంతమేరా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోజులో రెండు మూడు సార్లు వర్షం నమోదు అవుతుండటంతో లోతట్టు భూముల్లోకి నీరు చేరుతుంది.

చదువు ఆవశ్యకతను వివరించాలి



బడిబయట పిల్లలను బడిలో చేర్చుతున్న సర్పంచ్ మహేశ్వరరావు

గరుగుబిల్లి: చదువు ఆవశ్యకతను బడిబయట ఉన్న చిన్నారులకు వివరించాలని రావుపల్లి గ్రామ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు అన్నారు. కొత్తూరు క్లస్టర్ పరిధిలో మంగళవారం బడిబయట చిన్నారుల గుర్తింపు సర్వే నిర్వహించారు. చదువు మధ్యలో మానేసిన పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తోందని, కాబట్టి ప్రతీ విద్యార్థి బడికి వెళ్లి చదువుకోవాలని కోరారు.

తల్లీబిడ్డకు సంపూర్ణ పోషణ



మాట్లాడుతున్న సీడీపీఓ సిమ్మాలమ్మ

వీరఘట్టం: వైఎస్సార్ సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత పౌష్టికాహారం అందుతోందని సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. వీరఘట్టం కూరాకులవీధి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను అధిగమించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. ప్రతీ నెల ఒక కిలో కందిపప్పు, 3 కిలోల బియ్యం, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల చిక్కీలు, 500 గ్రాముల నూనె, 250 గ్రాముల ఎండు ఖర్జూరం, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, 1 కిలో రాగిపిండి తదితర సరుకులను వైఎస్సార్ సంపూర్ణ కిట్లు ద్వారా అందజేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేశ్వరి, శాంతికుమారి, జ్ఞానమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: శాఖాగ్రంథాలయంలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు



వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కురుపాం: కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



కొమరాడ: కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎస్.రవికుమార్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ సుగుణ



జియ్యమ్మవలస: అల్లువాడ ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం రూపవతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం



జియ్యమ్మవలస: రావాడ ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం వి.అనూరాధ ఆధ్వర్యంలో..



గుమ్మలక్ష్మీపురం: మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సన్మానిస్తున్న ఎంపీపీ కె.దీనమయ్య, ఎంఈఓలు చంద్రశేఖర్, జనార్దనరావు



గుమ్మలక్ష్మీపురం: సంప్రదాయ కోలాటం నేర్పుతున్న గురువు మనోహర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు



సీతంపేట: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



గరుగుబిల్లి: శ్రీసాయినికేతన్ స్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు



పాలకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు



భామిని: ఏపీ మోడల్ స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

గురుభ్యోనమః

- ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి
- పలువురు ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన జయంతిని పురస్కరించుకుని పాలకొండ, కురుపాం నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, గ్రంథాలయాల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు ప్రజాప్రతినిధులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయునిగా, దేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రెండవ రాష్ట్రపతిగా సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్





సీతంపేట: బాలికల ఆశ్రమపాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం లిల్లీ రాణి, తదితరులు (ఇన్‌సెట్లో) భామిని: విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు శ్రీనివాస్, భాస్కరరావు

జంఝావతి నుంచి పుష్కలంగా సాగునీరు



జంఝావతి లోలెవెల్ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, తదితరులు

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జంఝావతి నుంచి సాగునీరు అందించాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ప్రాజెక్ట్ అధికారులకు సూచించారు. మండలంలోని చంద్రమ్మపేట సమీపంలో ఉన్న జంఝావతి లోవెల్ కెనాల్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఇటీవల కాలువలో పూడకతీత కోసం ప్రభుత్వం సుమారు రూ.7 లక్షలు విడుదల చేసింది. ఆ నిధులతో జంఝావతి లోవెవల్ కెనాల్‌లో పూడికలు తొలిగించారు. శివారు భూములకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. పార్వతీపురం రైల్వే ట్రాక్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగిన తరువాత పరుశురాంపురం, మార్కొండపుట్టి, చంద్రమ్మపేట, తదితర గ్రామాలకు రహదారి సదుపాయం లేకుండా పోయిందని వాపోయారు. కొత్తవలస దాటి జంఝావతి కాలువగట్టు మీదగా కనీసం గ్రావెల్ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జంఝావతి ప్రాజెక్టు డీఈ అప్పారావు, ఏఈ పవన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి మధుసూదనరావు, ట్రెజరర్ కళింగ మల్లేశ్వరరావు, పలువురు రైతులు ఉన్నారు.

ఒకే ఇంటి ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో..: పీఓ

సాలూరు: ఒక ఇంటి ఓటర్లందరు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి విష్ణుచరణ్ అన్నారు. ఓటరు జాబితా విచారణలో భాగంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఒక పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1500 ఓట్లు మాత్రమే ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఒక ఇంటి ఓటర్లతో పాటు వీధిలో ఓటర్లు అవకాశం ఉన్నంత వరకు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూలై 21 నుండి ఆగస్టు 21 వరకు ఇంటింటి ఓటరు విచారణ చేపట్టామని అన్నారు. ఓటరు విచారణలో భాగంగా ఫారం 6, 7, 8 తీసుకోవడం జరిగిందని అన్నారు.ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల తొలగింపు ఉంటుందని స్పష్టం చేశారు. మరణించిన వ్యక్తులు, శాశ్వతంగా వలసలు వెళ్లినవారు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు తొలగించడం జరుగుతుందని అన్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల నాయకుల సందేహాలను నివృత్తి చేస్తూ, వారి సూచనలను తెలుసుకుని చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలమురళీకృష్ణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

గరుగుబిల్లి: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరుచేస్తోందని గరుగుబిల్లి పంచాయతీ సర్పంచ్ కె.ఇందుమతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో కొత్తగా పింఛన్‌లు పొందిన లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అర్హత ఉంటే ఇంటి తలుపులు తట్టి నేరుగా లబ్ధిదారులకు పింఛన్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఇందుమతి

108 సిబ్బంది దాతృత్వం

జియ్యమ్మవలస: మండలంలో 108 అంబులెన్స్ పైలట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కన్నపుదొరవలస గ్రామానికి చెందిన బంకురు తవిటినాయుడు 15 రోజుల కిందట తీవ్ర అస్వస్థతకు గురై విజయనగరంలోని తిరుమల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడుకి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పనిచేస్తున్న 108 సిబ్బంది ఆర్థిక సాయం అందజేశారు. తలో కొంతమొత్తం పోగుచేసుకొని రూ.70,300 సేకరించారు. ఈ మొత్తాన్ని మంగళవారం బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గొర్లి అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి తెర్లి వెంకటరమణ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు వేమల అప్పలనాయుడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లు గోపాలం మాట్లాడుతూ... 108 సిబ్బంది కుటుంబ సభ్యుల్లో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా ఆదుకొనే ఆనవాయితీ గత పది సంవత్సరాల నుంచి కొనసాగుతుందని తెలిపారు.



బాధితుడికి నగదు అందజేస్తున్న 108 సిబ్బంది

సిమెంట్ పనులకు శ్రీకారం

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం పంచాయతీ మల్లివీడులో పేరుకుపోయిన తాగునీటి సమస్యకు జలజీవన్ మిషన్ పథకం ద్వారా పరిష్కారం లభించింది. రూ.29 లక్షలతో చేపట్టిన రక్షిత ట్యాంక్ పనులకు సంబంధించిన సిమెంట్ ఫౌండేషన్ పనులను మంగళవారం సర్పంచ్ రణస్థలం రమాదేవి లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవస విక్రాంత్‌ల చొరవతో పనులు, నిధులు మంజూరు కావటంతో స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామీణ నీటిసరఫరా విభాగం డీఈఈ ఢిల్లేశ్వరరావు, ఏఈ విస్సీ ప్రవళిక, ఇంజినీరింగ్ సహాయకులు శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు రణస్థలం రాంబాబు తదితరులున్నారు.



మల్లివీడులో రక్షిత ట్యాంక్ ఫౌండేషన్ పనులు ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సరుకుల సరఫరాకు టెండర్ల ఖరారు

సీతంపేట: గిరిజన సహకార సంస్థ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలకు సరుకులు సరఫరా చేసే టెండర్లు మంగళవారం ఖరారయ్యాయి. ఈ సందర్భంగా జీసీసీ డీఎం జి.సంధ్యారాణి మాట్లాడుతూ.. టెండర్ దక్కించుకున్న వారు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలన్నారు. టెండర్లలో ఏవైతే కోట్ చేశారో వాటిని మాత్రమే సరఫరా చేయాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కందిపప్పు, పెసరపప్పు, మినపప్పులు, ఆయిల్ ప్యాకెట్లు, శనగపప్పు, బఠాని, ఇడ్లీనూక వంటివి బ్రాండెడ్ సరుకులకు టెండర్ల ఖరారైనట్లు చెప్పారు. మొత్తం 52 రకాల సరుకులకు ఏడుగురు టెండర్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్లు జి.నరసింహులు, డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



టెండర్లు తెరుస్తున్న అధికారులు

పక్కాగా ప్రీస్కూల్ నిర్వహణ

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రీ-స్కూల్ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించాలని భద్రగిరి సీడీపీఓ సీహెచ్.సుశీలాదేవి అన్నారు. మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ మంగళవారం ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతూ.. కేంద్రాల నిర్వహణలో భాగమైన అన్ని రకాల రికార్డులు, యాప్‌లను సక్రమంగా నిర్వహించాలని, గర్భిణులు, బాలింతలకు సకాలంలో పోషకాహార కిట్లు అందజేయాలని సూచించారు. అలాగే ప్రాజెక్ట్ పరిధిలోని 185 మంది కార్యకర్తలకు, 100 మంది హెల్పర్లకు నూతన యూనిఫాం దుస్తులను అందజేశారు. అలాగే ప్రీ-స్కూల్ విద్యార్థుల కోసం పీపీ-1, పీపీ-2 పుస్తకాలను పంపిణీ చేశారు. సమావేశంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, ఈశ్వరమ్మ, ఉనీష తదితరులున్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు యూనిఫాం దుస్తులు, ప్రీస్కూల్ పుస్తకాలను అందజేస్తున్న సీడీపీఓ సుశీలాదేవి

మెరుగైన వైద్య సేవలందించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

కురుపాం: ఏజెన్సీలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఆరోగ్య సిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని, మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి సరైన వైద్యం అందించాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో గర్భిణులకు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై డీఎంహెచ్‌ఓ సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి బి.ప్రజ్ఞ, సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట శ్రీధర్, భారతి, నాగేశ్వరరావు, విజయ్, ఆరోగ్య సహాయకుడు తిరుపతి తదిరులు ఉన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

రోగులకు కచ్చితమైన చికిత్స అందించాలి

- డీఐఓ డాక్టర్ జగన్మోహనరావు

భామిని: ఆస్పత్రికి వచ్చిన రోగులకు పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు చేసి కచ్చితమైన చికిత్స అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ జగన్మోహనరావు అన్నారు. భామిని, బత్తిలి పీహెచ్‌సీలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న మందులు, రక్త పరీక్షలు, వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ఆశావర్కర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. గర్భిణులకు ఆరోగ్య సేవలతో పాటు పోషకాహారం అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ ద్వారా టీఫా(టీఐఫీపీ) స్కానింగ్ చేయించుకోవచ్చని, దీని వల్ల పిండం ఎదుగుదల, ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. తద్వార గర్భిణులకు సకాలంలో మెరుగైన సేవలందించవచ్చన్నారు.



ఆశా కార్యకర్తలకు సూచనలు చేస్తున్న డీఐఓ జగన్మోహనరావు

ప్రత్యామ్నాయ పంటలతో ప్రయోజనం

భామిని: మండలంలోని బూర్జగూడ, సన్నాయికాలనీలో మంగళవారం సేంద్రియ వ్యవసాయ విధానాలపై వాస్సన్ సంస్థ గిరిజన రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. జీడి, మామిడి వంటి పండ్లతోటలలో ప్రత్యామ్నాయ పంటలతో రైతుకు అధనపు ఆదాయం కలుగుతుందని వాస్సన్ సంస్థ ప్రతినిధులు నర్సింగరావు, జయప్రకాష్ వివరించారు. జీడి తోటలతో కొమ్మకత్తిరింపు, పురుగు నివారణకు తీసుకొనే చర్యలు తెలిపారు. పాత మొక్కలు తొలగింపు తరువాత అదేచోట పప్పుదినుసులు, కూరగాయ మొక్కలు నాటుకోవాలి. జీడితో పాటు నిమ్మ, సపోటా, మామిడి, పనస, నాటితే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. మొక్కల పెరుగుదలకు సేంద్రియ పద్ధతుల సాగును వివరించారు. సంస్థ ప్రతినిధులు కళ్యాణ్ పాత్రో, ఎం.భార్గవి, కె.మనోజ్‌కుమార్, గిరిజన రైతులు పాల్గొన్నారు.